www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శుక్రవారం, 09 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-206 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## నేడు మెట్రో ఫేజ్-2కు సిఎం కెసిఆర్ శంకుస్థాపన: మెట్రో ఎండి

**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ మెట్రోపై విజన్‌తో ఉన్నారని మెట్రో ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి తెలిపారు. శంషాబాద్ వరకు మెట్రో విస్తరణ పనులకు శుక్రవారం సిఎం కెసిఆర్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌విఎస్ రెడ్డి మాట్లాడుతూ హయత్‌నగర్ వరకూ మెట్రో ఉండాలని మంత్రి కేటీఆర్ అన్నారని చెప్పారు. ఎంఎంటీఎస్ రెండో దశను కూడా చేయాలని సీఎం అన్నారని, కేంద్రం నుంచి అనుమతి వచ్చిన వెంటనే బీహెచ్‌ఈఎల్ నుంచి లక్డీకాపూల్ వరకు మెట్రో ప్రారంభిస్తామని ప్రకటించారు. ఏర్పేట్ మెట్రోను మూడేళ్లలో పూర్తి చేస్తామని, మెట్రో ఫేజ్ 1 విజయవంతంగా



3లో

## గూగుల్‌కు పోటీగా మైక్రోసాఫ్ట్ సెర్చ్ ఇంజిన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 8 (సమ సమాజం): యాపిల్ సిరి, గూగుల్ కి పోటీగా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కొత్త యాప్ తీసుకురానుంది. సూపర్ యాప్ పేరుతో కొత్త సెర్చ్ ఇంజిన్ ని లాంచ్ 3లో



# గుజరాత్‌లో 27 ఏళ్ల రికార్డు బద్దలు



సోలంకి రికార్డును దాటిని బిజెపి ● 150 సీట్ల మెజార్టీ దాటగలదన్న అంచనాలు

**అహ్మదాబాద్, డిసెంబర్ 8 (సమ సమాజం):** గుజరాత్ ఎన్నికల ఫలితాల్లో 150కిపైగా స్థానాల్లో అధికార బీజేపీ ఆధిక్యంలో కొనసాగుతోంది. భారీ మెజారిటీతో ఆ పార్టీ విజయదుందుభి మోగించడం దాదాపు ఖరారైంది. దీంతో గుజరాత్ ఎన్నికల్లో పలు పాత రికార్డులు తుడిచిపెట్టుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది. వరుసగా 27 ఏళ్ల గుజరాత్‌ను పాలిస్తున్న బీజేపీ గత ఎన్నికల్లో అత్యధికంగా 127 స్థానాలు మాత్రమే గెలవగలిగింది. 2002లో ఈ రికార్డ్ విజయాన్ని సాధించింది. ఇప్పుడు ఆ రికార్డ్ బ్రేక్ అవ్వడం ఖాయమని ట్రెండ్స్ చెబుతున్నాయి. మరోవైపు 1985లో మాధవ్ సింగ్ సొలంకి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ రికార్డ్ స్థాయిలో 149 స్థానాల్లో గెలిచి రికార్డ్ స్థాయి మెజారిటీని సాధించింది. సామాజిక కూటమి ఖమ్ (కోలి క్షత్రియ, హరిజన్, ఆదివాసి, ముస్లిం) ఏర్పాటు చేసిన సోలంకి అతి భారీ విజయాన్ని సాధించడంలో సఫలీకృతమయ్యారు. గుజరాత్ ఎన్నికలకు సంబంధించి ఇప్పటీ అదే రికార్డుగా ఉంది. అయితే ఇప్పుడు ఆ రికార్డ్‌ను బీజేపీ చెరిపేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా గత 27 ఏళుగా గుజరాత్ పాలిస్తున్న బీజేపీ గత అసెంబ్లీ ఎన్నికలు 2017లో 99 స్థానాలు గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చింది. కానీ తాజా ఎన్నికల్లో చతికిలపడింది. 1985లో రికార్డ్ స్థాయి విజయం సాధించిన కాంగ్రెస్ ఈసారి ఎన్నికల్లో అత్యంత చెత్త ఓటమిని మూటగట్టుకుంది. 3లో

# నేడు ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

## టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్ మారుస్తూ ఇసి ఆమోదం



- తెలంగాణ భవన్‌లో సంబరాలకు సిఎం కెసిఆర్ నిర్ణయం
- పార్టీ శ్రేణులు భారీగా హాజరు కావాలని పిలుపు

**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్ర సమితి భారత రాష్ట్ర సమితిగా మారిన నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ ఆవిర్భావ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1:20 గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరగనుంది. ఈ వేదిక నుంచి బీఆర్ఎస్ జెండాను కేసీఆర్ ఆవిష్కరించనున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ కార్యక్రమంలో భారీ ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొనాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఆవిర్భావ కార్యక్రమానికి పార్టీ కార్యవర్గ సభ్యులు, పార్టీ జిల్లాల అధ్యక్షులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హాజరుకావాలని ముఖ్యమంత్రి కోరారు. వీరితోపాటు.. జిల్లా పరిషత్ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డిసిసిబి అధ్యక్షులు, డీసీఎంఎస్ అధ్యక్షులతో పాటు పార్టీ ముఖ్యులు అందరూ శుక్రవారం మధ్యాహ్నం లోపు తెలంగాణ భవనకు చేరుకోవాలని పార్టీ అధినేత సీఎం కేసీఆర్ తెలిపారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చాలని ఈ ఏడాది దసరా పర్వదినం రోజున ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పార్టీ తరఫున కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసిన విషయం విదితమే. ఎట్టకేలకు కేసీఆర్ రాసిన లేఖపై కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. టీఆర్ఎస్‌ను భారత్ రాష్ట్ర సమితిగా మారుస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. పార్టీ మార్పునకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నుంచి కేసీఆర్‌కు అధికారికంగా లేఖ అందింది. దీంతో పార్టీ నాయకులు, శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా తెలంగాణ రాష్ట్ర సమితి భారత రాష్ట్ర సమితిగా మారింది. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చాలని

3లో

# హిమాచల్‌లో అధికారం దిశగా కాంగ్రెస్

## 39 స్థానాల్లో ఆధిక్యంతో దూకుడు

**సిమ్లా, డిసెంబర్ 8 (సమ సమాజం):** ఉత్కంఠ రేపుతున్న హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల కౌంటింగ్‌లో సమీకరణం మారుతోంది. ఉత్కంఠ రేపుతున్న హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఆధిక్యం మరింత పెరిగింది. మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో 39 స్థానాల్లో కాంగ్రెస్, 26 చోట్ల బీజేపీ, ఇతరులు 3 స్థానాల్లో ముందంజలో ఉన్నారు. హోరాహోరీ పోరు ఖాయమనుకున్నప్పటికీ బీజేపీపై కాంగ్రెస్ పైచేయి సాధించినట్టుగా కనిపిస్తోంది. కాగా ప్రభుత్వ ఏర్పాటుకు ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ 35 గా ఉంది. 3లో



## ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



- ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వ ఏర్పాట్లు
- అధికారుల, ప్రజాప్రతినిధులతో మంత్రులు సమీక్ష

హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం): ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు అన్ని పండుగలను ప్రభుత్వం ఆధ్వర్యంలో సంతోషంగా జరుపుకుంటున్నారని అన్నారు. పేదలు కూడా క్రిస్మస్ ను 3లో


## ఇంటర్ పరీక్ష ఫీజుకు మరోమారు అవకాశం

- ఈనెల 12 వరకు పెంచి ఇంటర్ బోర్డు
- కాలేజీల్లో వంద అపరాధ రుసుముతో చెల్లించే ఛాన్స్

**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** ఇంటర్ పరీక్షల ఫీజుకు సంబంధించి తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక ప్రకటన చేసింది. ఇప్పటి వరకు వార్షిక పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులకు మరోసారి అవకాశం ఇచ్చింది. రూ. 100 ఆలస్య రుసుముతో డిసెంబర్ 12 వరకు ఇంటర్ ఫీజు చెల్లించవచ్చని పేర్కొంది. విద్యార్థులు వారి కాలేజీల్లో 3లో

## ఫామ్‌హౌస్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదుపై వాదనలు

### అవినీతి నిరోధక చట్టం చెల్లదన్న ప్రతివాదుల లాయర్



**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** ఫామ్ హౌస్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదుపై హైకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి మొయినాబాద్ ఇన్స్పెక్టర్‌కు అర్హత లేదంటూ ఏసీబీ కోర్టు తీర్పు ఇచ్చిందని.. అడ్వొకేట్ జనరల్ హైకోర్టుకు తెలిపారు. ఎఫ్ఐఆర్‌ను ఏ పోలీస్ స్టేషన్ అయినా నమోదు చేయవచ్చని ఆయన చెప్పారు. నిందితుల తరుపు 3లో

## షర్మిల ముమ్మాటికీ బిజెపి వదిలిన బాణమే

### ఆమెకు ఎక్కడా రాష్ట్ర సమస్యలపై ఆసక్తి లేదు: తమ్మినేని



**ఖమ్మం, డిసెంబర్ 8 (సమ సమాజం):** వైఎస్ షర్మిల ముమ్మాటికీ బీజేపీ వదిలిన బాణమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆమెకు మోడీ ఫోన్ చేయడమే ఇందుకు బలమైన నిదర్శనమని అన్నారు. బిజెపి అండలేకుండా ఆమె ఇంతగా దూకుడు ప్రదర్శించలేరని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ షర్మిల మాట్లాడుతున్న భాష, వ్యాఖ్యలు, టీఆర్ఎస్‌పై చేస్తున్న విమర్శలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆమె పాదయాత్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాదని ఎద్దేవా 3లో

## తెలంగాణలోనూ గుజరాత్ ఫలితమే





- అవినీతి ప్రభుత్వానికి చరమగీతం పాడుతాం
- మోటర్లకు మీటర్లు ఉత్తుత్తి ప్రచారమే
- వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఎక్కడో చూపాలి
- లేకుంటే కెసిఆర్ రాజకీయ సన్యాసం తీసుకోవాలి
- జగిత్యాలలో కొనసాగుతున్న బండి సంగ్రామయాత్ర

3లో

## సంపాదకీయం

# బిజెపికి ఆత్మవిశ్వాసం నింపిన గుజరాత్

దేశంలో దూకుడు రాజకీయాలు ప్రదర్శిస్తున్న బిజెపికి గుజరాత్ విజయం ఆత్మవిశ్వాసం నింపిదంనే చెప్పాలి. ఇక్కడ గెలవడం అన్నది బిజెపికి ముఖ్యంగా మోడీ అమిత్ షాలకు అత్యంత అవసరం. అందుకే ఎవరేమనుకున్నా మోడీ, అమిత్ షాలు ఇక్కడే మకాం వేసి జోరు ప్రచారం నిర్వహించారు. ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో అధకారం కోల్పోయినా, హిమాచల్‌లో ఓటమి చెందినా పెద్దగా ప్రభావం ఉండదు. కానీ గుజరాత్ లో ఓటమి చెందితే ఈ ఇద్దరు నేతల పనితీరుపై తీవ్ర ప్రభావం పడేది. అలాగే బిజెపిలో కూడా వీరి ప్రాభవం తగ్గేది. విపక్షాలు కూడా విమర్శల దాడిని పెంచేవి. ఈ అవకాశం రాకుండా చూసుకోవడంలో మోడీ ద్వయం విజయం సాధించిందనే చెప్పాలి. వరుసగా ఏడోసారి గుజరాత్‌లో బిజెపి అధికారం నిలబెట్టుకో బోతోంది. ఇది ఆషామాషీ విషయం కాదు. ఇకపోతే మిగతా రాష్ట్రాలతో పోలిస్తే గుజరాత్ విషయంలో ప్రజలు కూడా మోడీ ద్వయానికి అనుకూలంగానే ఆలోచించి ఉంటారు. ఎందకంటే ప్రధాని,హోంమంత్రి తమవారైనప్పుడు రాష్ట్రంలో బిజెపి అధకారంలో ఉంటేనే అంతోఇంతో మంచి జరుగుతుందని గత ఎనిమి దేళ్లలో గుర్తించి ఉంటారు. అందుకే కాంగ్రెస్ లేదా, ఆప్‌ను నమ్ముకుంటే నర్మదాలో మునగడం ఖాయమని తెలుసు. మరోవైపు మోడీ ఛరిష్మా కూడా బాగానే పని చేసిందని చెప్పాలి. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల కౌంటింగ్ పక్రియ కొనసాగుతోంది. గుజరాత్‌లో బీజేపీ ఏడోసారి అధికారం చేపట్టే దిశగా వెళ్తోంది. గుజరాత్‌లో బీజేపీ 150 కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా.. హిమాచల్ ప్రదేశ్‌లో హోరాహోరీ పోరు సాగుతోంది. గుజరాత్ లోని మొత్తం 182 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో 68 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. బీజేపీతో పాటు కాంగ్రెస్, ఆప్ పార్టీల్లో ఈ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీ 150 కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. దీంతో పార్టీ కార్యకర్తలు ఆనందంలో మునిగి తేలుతున్నారు. పార్టీ కార్యాలయాల వద్ద సంబరాలు చేసుకుంటున్నారు. మొత్తంగా గుజరాత్‌లో మరోసారి బీజేపీ జెండా ఎగుర వేయబోతుంది. అన్నింటికి మించి గుజరాత్‌లో మోడీద్వయం ప్రభ వెలుగుతోందని చెప్పుకోవాలి. ప్రజలు కూడా బిజెపిని ఓడించడం ద్వారా సాధించేదేమీ లేదు. అందుకే మరోమారు బిజెపికి పట్టం కట్టడం ద్వారా విజ్ఞత ప్రదర్శించారనే చెప్పాలి. దేశంలో ఆర్థిక మందగమనం ఎలా ఉన్నా దేశంలో సమర్థమైన పాలన సాగేలా మోడీ తీసుకుంటున్న చర్యలు దేశంలోనే గాకుండా, ప్రపంచంలోనూ ప్రశంసలు వస్తున్నాయి. అగ్రరాజ్యాలు అమెరికా,రష్యాలతో స్నేహం చెడకుండా వాటితో బంధాన్నికొనసాగిస్తున్న తీరు మోడీ చాతుర్యానికి నిదర్శనంగా చూడాలి. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత అనేక కీలక నిర్ణయాలు తీసుకోవడం మోడీ ప్రభుత్వానికే సాధ్యమయ్యింది. ప్రజల కోసం పని చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్న ప్రభుత్వంగా మోడీ నిరూపించుకుంటున్నారు. మోడీ సారథ్యంలోని రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన విజయాలను సాధించింది. అన్నింటికి మించి 370 ఆర్టికల్ రద్దు చేయడం, పాక్‌ను ఏకాకి చేయడం అన్నది ప్రపంచ చరిత్రలో అద్భుతమైన విజయంగా చూడాలి. అది బిజెపి మాత్రమే చేయగలదని నిరూపించారు. ఇదే క్రమంలో అవినీతి నేతలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఇడి, ఐటి దాడులతో దేశంలో అక్రమార్కులకు కళ్లెం వేసే కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో జరిగిన దాడులతో పాటు తాజా వ్యవహారాలు చూస్తుంటే అవినీతి నేతలను బొక్కలో తోయడానికి మోడీ వెనకాడడని నిరూపించారు. ఇలా రాజకీయాలను అడ్డం పెట్టుకుని ప్రజాధనాన్ని దోచుకున్న దగుల్బాజీలను బొక్కలో తోస్తే ప్రజలు జేజేలు పలుకుతారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ పలు కీలక నిర్ణయాలను తీసుకోవడమే గాకుండా వాటిని అమలు చేసి చూపారు. ఈ విజయాలను చూస్తున్న ప్రజలు ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతి కావాలని కోరుకుంటున్నారు. అలాగే రాజకీయ సంస్కరణలు కూడా కోరుకుంటున్నారు. దేశంలో అవినీతి రహిత రాజకీయాలను ప్రజలు కోరుకుంటున్నారు. ఈ దిశగా మోడీ కఠిన చర్యలకు ఉపక్రమిస్తే ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉంటుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ రెండో ప్రభుత్వం సాహసో పేతమైన నిర్ణయాలతో పురోగమించాలని గుజరాత్ ప్రజలు కూడా కోరుకుంటున్నారు. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేయడం ఒక చరిత్రాత్మకమైన నిర్ణయం. ఏడు దశాబ్దాలుగా అపరిష్కృతంగా వున్న కశ్మీర్ సమస్యను ప్రధాని మోదీ ప్రభుత్వం 70 రోజుల్లో అనితర సాధ్యంగా పరిష్కరించింది. విదేశాంగ విధానంతో కూడా మోడీ ఆకట్టుకుంటున్నారు. బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వాలు తమ దేశ అత్యున్నత పౌర పురస్కారాలను మోదీకి ప్రదానం చేశాయి. దీంతో కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ అంతర్జాతీయ సమాజంలో పూర్తిగా ఏకాకి అయ్యింది. ఇది మోదీ రాజనీతిజ్ఞతకు ఒక తిరుగు లేని నిదర్శనంగా చూడాలి. కరోనా సమయంలో వ్యాక్సిన దేశానికే కాకుండా విదేశాలకు కూడా ఉచితంగా అందించి దార్శనికతను ప్రదర్శించారు. ఇకపోతే దేశరక్షణ వ్యవస్థలో కూడా అతి పెద్ద సంస్కరణకు మోదీ సర్కార్ పూనుకున్నది. సరిహద్దుల్లో చైనా, పాక్ విసురు తున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొనేలా చర్యలకు ఉపక్రమించారు. ఫలితంగా ప్రధాని మోదీ నాయకత్వ పటిమ, పాలనా దక్షతపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. దీర్ఘకాల ప్రయోజనాలపైనే మోదీ సర్కార్ దృష్టిని కేంద్రీకరించిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో దేశం ఎదుర్కొం టున్న అనేక సమస్యలపై ఇంకా యుద్ధంచేయాల్సి ఉంది. అవినీతి రహిత పాలనతో పాటు రాజకీయ అవినీతిని పారద్రోలాల్సి ఉంది. రాజకీయాల్లో వారసత్వాన్ని రూపుమాపాలన్న నినాదం కూడా బాగా పనిచేస్తోంది. ఒకేదేశం, ఒకే చట్టం అన్ననినాదాన్ని కూడా బాగా ప్రచారం చేస్తున్నారు. జనాభా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలన్న ప్రచారం సాగుతోంది. ఇవన్నీ సాకారం చేసే దిశగా అడుగులు వేస్తే మోడీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతారు. అలాగా భారత్ బలమైన దేశంగా ఎదుగుతుందన్న వాదన ప్రచార రూపంలో ఉంది. ఇవన్నీ కూడా గుజరాత్ ప్రజలు గమనిస్తున్నారు. అందుకే మరో పార్టీకి ఓటేసి లేని సమస్యలు కొని తెచ్చుకోవడం వారికి ఇష్టం లేదు. అందుకే విజ్ఞతతో ఓటేసారని గమనించాలి. ఇది గుజరాత్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి బిజెపిని గెలిపించుకున్న ఓటుగా మాత్రమే చూడాలి.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# నిజాం షుగర్ ఫ్యాక్టరీని విస్మరించిన కెసిఆర్

### కొండగట్టుకు వందకోట్లు వెంటనే విడుదల చేయాలి: జీవన్ రెడ్డి



**జగిత్యాల, డిసెంబర్8 (సమ సమాజం):** ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంలో జిల్లా అధికార పార్టీ నాయకులు విఫలమయ్యారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శించారు. జగిత్యాల జిల్లాపై సీఎం కేసీఆర్ సవతి తల్లి ప్రేమ చూపించారని ఆరోపించారు. జగిత్యాల జిల్లాకు ఎలాంటి వరాల కురిపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండగట్టుకు రూ.100 కోట్లు కేటాయించినట్లు ప్రకటించిన సీఎం కేసీఆర్ వెంటనే ఆ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ వెంటనే తెరిపించాలని కోరారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరవడం చెరుకు రైతుల కల అని గుర్తు చేశారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల కోరిక మేరకు వడ్డలింగాపూర్, అల్లీపూర్ ను మండలాలుగా ప్రకటించాలన్నారు. జిల్లాలోని గ్రామ సర్పంచులకు ప్రతి గ్రామానికి రూ.10 లక్షల నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# గ్రంధాలయాలకు పూర్వ వైభవం

### తార్నాకలో నిర్మాణ పనిని ప్రారంభించిన మంత్రులు

**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** రాష్ట్రంలోని గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర పశువైద్య, సినిమాటోగ్రఫి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు విడుద చేసి బలోపేతం చేస్తున్నామని అన్నారు. నగరంలోని తార్నాక లో రూ. 84 లక్షలతో చేపట్టనున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గ్రంథాలయాలను పట్టించుకోలేదని అన్నారు. అభ్యర్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనకుండా అన్ని వసతులతో గ్రంథాలయా లను నిర్మిస్తున్నామని తెలిపారు. పోటీ పరీక్షల అభ్యర్థులకు కావలసిన పుస్తకాలను,అన్నపూర్ణ భోజనం అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. నగరంలో 14 గ్రంథాలయాలు మంజూరు కాగా వీటిలో కొన్ని నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లు శ్రీధర్, ప్రసన్నతదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తున్నాం

### కన్యాపరమేశ్వరి ఆలయానికి భూమిపూజ ● వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడి



**వనపర్తి, డిసెంబర్8 (సమ సమాజం):** ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలో రూ. 25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న కన్యకాపరమేశ్వరి ఆలయానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ అవసరాల మేరకు వనపర్తిలో రహదారుల విస్తరణ చేపట్టామని వెల్లడించారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రహదారుల విస్తరణ చేపట్టినట్లు వెల్లడించారు. భౌగోళికంగా వనపర్తి రహదారులకు, ఉమ్మడి జిల్లాలోని మిగతా పట్టణాలకు ఎంతో తేడా ఉన్నదని అన్నారు. పాన్‌గల్, చిట్యాల, పెబ్బేరు, కొత్తకోట, గోపాల్‌పేటల వైపు రహదారుల విస్తరణ కారణంగా బాధితుల సంఖ్య ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటామని, డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపులో బాధితులకే తొలి ప్రాధాన్యం ఇచ్చి ఇండ్లు కేటాయించామని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సతీమణి వాసంతి, టీఆర్ఎస్ నాయకులు, అధికారులు

# కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్‌కు గిఫ్ట్

### సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం

**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ గా కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్ నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో రెండు సంవత్సరాలు పదవిలో ఉండనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్ కు ఆఫీసు, సిబ్బంది, వాహనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఫుడ్ అండ్ సివిల్ సప్లయిస్ శాఖకు సూచించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు సర్దార్ రవీందర్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్ గురువారం రవీందర్ సింగ్ కూతురు పెళ్లికి హాజరయ్యారు. ఆ తర్వాతనే సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ గా రవీందర్ సింగ్ ను నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు బయటకు రావడం కరీంనగర్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ముందుగా బీజేపీలో ఉన్న రవీందర్ సింగ్.. 2006లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో భాగంగా బీజేపీకి రాజీనామా చేసి కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. మూడు సార్లు కరీంనగర్ కార్పొరేటర్ గా గెలిచిన ఆయన..2014లో మేయర్ గా పనిచేశారు.





# ధాన్యం సేకరణకు పక్కా ప్రణాళిక

### కెసిఆర్ ఆదేశాలతో ధాన్యం కొనుగోళ్లు

### నంగునూరు కార్యక్రమంలో మంత్రి హరీష్ రావు



**సిద్ధిపేట, డిసెంబర్ 8 (సమ సమాజం):** వడ్లు కొనమంటే బీజేపీ ప్రభుత్వం నూకలు తినాలని తెలంగాణ ప్రజలను అవహేళన చేసిందని మంత్రి హరీశ్‌రావు మరోమారు పాత డైలాగునే వల్లించారు. అయితే సిఎం కెసిఆర్ మాత్రం రైతులకు నష్టం కలగకుండా వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాలలో 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం సామూహిక గొర్రెల షెడ్ ప్రారంభించారు. షెడ్లలో లబ్దిదారులకు బట్టలు బహూకరించారు. ఆ తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే నంగునూరు మండల వాగు అవతలి గ్రామ ప్రజలకు మేలు చేకూరేలా దవాఖాన తెచ్చారని గుర్తు చేశారు. మండల కేంద్రమైన నంగునూరు నుంచి ఖాతా వరకూ డబుల్ లైన్ రోడ్డు వేసుకున్నామని, విద్యుత్ సబ్ స్టేషన్లు, ఏడు చెక్ డ్యాములతో నీళ్ల ఊటలు పెరిగాయన్నారు. మండల కేంద్రంలో ఉండే పీహెచ్ సీ గట్లమల్యాల గ్రామానికి తెచ్చుకున్నట్లు మంత్రి వివరించారు. ఏఎన్ఎం సబ్ సెంటరులోనే తాత్కాలిక భవనం, శాశ్వత భవనానికి రూ.2కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వడ్ల బీట్ లేకపోతే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ యాసంగిలో కాళేశ్వరం నీళ్లు తెచ్చి నంగునూరు పెద్ద వాగులో నీళ్లు నింపుతామని మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరును వివరించారు. మంత్రి వెంట రాష్ట్ర ఆయిల్ ఫెడ్ సంస్థ వైస్ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, నాయకులు జాప శ్రీకాంత్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, స్థానిక నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హిమాచల్‌లో కాంగ్రెస్‌దే విజయం: విహెచ్



**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** హిమాచల్‌ప్రదేశ్‌లో ఎన్నికల ఫలితాలపై మాజీ పీసీసీ అధ్యక్షులు వి.హనుమంత్‌రావు స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... హిమాచల్‌ప్రదేశ్‌లో తాము ఆధిక్యంలో ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్ సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రియాంక గాంధీ రెండుసార్లు అక్కడికి వెళ్లి ప్రచారంలో పాల్గొన్నారన్నారు. గుజరాత్‌లో రెండు మూడు తప్పులు జరిగాయని... ఆప్, ఎంఐఎం రెండు పార్టీలు కాంగ్రెస్‌కు నష్టం చేశాయని విమర్శించారు. బీసీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని.. లేకపోతే ఓటు బ్యాంక్ వేరే పార్టీల వైపు పోతుందని హనుమంతరావు పేర్కొన్నారు.

# జాతీయ పార్టీగా ఆప్‌కు గుర్తింపు

### గుజరాత్ ఫలితాలపై సిసోడియా వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబర్8 (సమ సమాజం):** గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు 'ఆమ్ ఆద్మీ పార్టీ'ని జాతీయ స్థాయికి ఎదిగేలా చేస్తున్నాయని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా గురువారం తెలిపారు. గుజరాత్ ఓట్లతో 'ఆప్' జాతీయ పార్టీ కాబోతున్నది. దేశంలో తొలిసారిగా విద్య, ఆరోగ్యం ఆధారంగా రాజకీయాలకు దేశంలో గుర్తింపు లభిస్తోంది. భారత దేశ ప్రజలకు అభినందనలు అని సిసోడియా ట్వీట్ చేశారు. తొలి ఓట్ల లెక్కింపులో ఆప్ 144 అసెంబ్లీ స్థానాల్లో ముందుండగా, కాంగ్రెస్ కేవలం 20 స్థానాల్లో ముందుండి చాలా వెనుకబడ్డది. ఆప్ తన తీవ్ర ప్రచారంతో గుజరాత్‌లో త్రికోణ పోటీని సృష్టించింది. ఢిల్లీ, పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వాలు రాష్ట్ర స్థాయి పార్టీ హోదాను స్థిరపరిచాయి. కాగా ఇప్పుడు గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు దానికి జాతీయ పార్టీ హోదాను అందించబోతోంది. ఓ రాజకీయ పార్టీ జాతీయ పార్టీగా గుర్తింపు పొందాలంటే కనీసం నాలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందాల్సి ఉంటుంది. అదే రాష్ట్ర పార్టీగా గుర్తింపు పొందాలంటే కనీసం రెండు సీట్లు గెలవాలి, ఆరు సీట్లు సాధించాల్సి ఉంటుంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత, ఆప్ పార్టీ ఢిల్లీ, పంజాబ్, గోవా, గుజరాత్ రాష్ట్రాల్లో అంటే నాలుగు రాష్ట్రాల్లో రాష్ట్ర పార్టీగా గుర్తింపు పొందుతుంది. దాంతో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ స్థాయి పార్టీ స్థాయికి ఎదగనున్నది.

# ఎన్ని కుట్రలు చేసినా బిజెపి వెంటే గుజరాత్ ప్రజలు

### బిజెపి నేత డికె అరుణ వ్యాఖ్య

### అధికారులు ఒత్తిడికి గురవుతున్నారన్న చంద్రవదన్

**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** గుజరాత్ రాష్ట్రంలో బీజేపీ ఘన విజయం సాధించడంపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హర్షం వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా... గుజరాత్ ప్రజలు బీజేపీ, ప్రధాన మంత్రి నాయకత్వంపై నమ్మకం ఉంచి ఇంతటి ఘన విజయాన్ని కట్టబెట్టారన్నారు. వరుసగా ఏడోసారి బీజేపీకి పట్టం కల్పించిన గుజరాత్ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. గుజరాత్ ఫలితాలు కచ్చితంగా తెలంగాణపై ప్రభావం పడుతుందని డీకే అరుణ అన్నారు. ఇదిలావుంటే ఐఏఎస్, ఐపీఎస్‌లకు రాష్ట్రంలో స్వేచ్ఛ లేకుండా పోయిందని, వారు నిరంతరం తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని మాజీ ఐఏఎస్ అధికారి, బీజేపీ నేత చంద్రవదన్ అన్నారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ప్రతి ఏడాది ట్రైనింగ్ కు వెళ్లాల్సి ఉన్నా కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకుంటోందని చంద్రవదన్ అ న్నారు. చట్టం, రూల్ ఆఫ్ లా ప్రకారం రాష్ట్రంలో ఐఏఎస్ ఐపిఎస్ అధికారులు విధులు నిర్వర్తించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.





# నేడు ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి) ఈ ఏడాది దసరా పర్వదినం రోజున ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పార్టీ తరపున కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసిన విషయం విదితమే. ఎట్టకేలకు కేసీఆర్ రాసిన లేఖపై కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. టీఆర్ఎస్‌ను భారత్ రాష్ట్ర సమితిగా మారుస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. పార్టీ మార్పునకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నుంచి కేసీఆర్‌కు అధికారికంగా లేఖ అందింది. దీంతో పార్టీ నాయకులు, శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది అక్టోబర్ 5న దసరా శుభఘడియల్లో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. దేశ ప్రజల అభ్యున్నతిని కాంక్షిస్తూ తెలంగాణ సీఎం కేసీఆర్ నూతన జాతీయ పార్టీని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరునే భారత రాష్ట్ర సమితిగా మారుస్తూ తెలంగాణ భవన్ వేదికగా కేసీఆర్ అధికారిక ప్రకటన చేశారు. టీఆర్ఎస్ పేరును మారుస్తూ దసరా రోజున నిర్వహించిన పార్టీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు 283 మంది టీఆర్ఎస్ ప్రతినిధులు ఆ తీర్మానంపై సంతకం చేశారు. దీంతో 21 ఏండ్ల టీఆర్ఎస్ ప్రస్థానంలో మరో మలుపు చోటు చేసుకుంది. సుమారు 8 రాష్ట్రాలకు చెందిన నేతలు కూడా టీఆర్ఎస్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు అని కేసీఆర్ ఆ రోజున తీర్మాన ప్రతిని చదివి వినిపించారు.




# రామచంద్రభారతికి నాంపల్లి కోర్టు బెయిల్

**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ లో నమోదైన ఓ కేసులో రామచంద్ర భారతికి నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల నగదు చొప్పున రెండు పూచీకత్తులను సమర్పించాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. నందకుమార్ కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండు విధించింది. దీంతో నందకుమార్ ను చంచల్ గూడ జైలుకు పోలీసులు తరలించారు. అంతకుముందు.. మొయినాబాద్ ఫాం హౌస్ కేసులో నిందితులు రామచంద్ర భారతి, నందకుమార్ ఇవాళ ఉదయం చంచల్ గూడ జైలు నుంచి విడుదలయ్యారు. అలా విడుదల అయ్యారో లేదో జైలు బయటే ఇద్దరిని బంజారా హిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదుల ఆధారంగా వారిద్దరిని మళ్లీ అదుపులోకి తీసుకున్నారు. నకిలీ ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ కేసులో రామచంద్ర భారతిని, చీటింగ్ కేసులో నందకుమార్‌ను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఇద్దరికి షౌకత్



నగర్ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇద్దరు నిందితులను పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

# ప్యానెల్ స్పీకర్‌గా విజయసాయి తొలగింపు



**న్యూఢిల్లీ, డిసెంబర్8 (సమ సమాజం):** వైసీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి కి రాజ్యసభ చైర్మన్ షాక్ ఇచ్చారు. ప్యానల్ వైస్ చైర్మన్‌గా విజయసాయిరెడ్డి పేరు తొలగించినట్లు తెలిపారు. ఈ నెల 5న విజయసాయిరెడ్డికి పంపిన లేఖలో ప్యానల్ వైస్ చైర్మన్‌గా నియమించినట్లు రాజ్యసభ ఆఫీస్ సమాచారం అందించింది. ఇవాళ రాజ్యసభలో ప్యానల్ వైస్ చైర్మన్ల పేర్లు చదివి చైర్మన్ వినిపించారు. విజయసాయి పేరును జాబితా నుంచి తొలగించినట్లు రాజ్యసభ చైర్మన్ పేర్కొన్నారు. మిగతా ఏడుగురి ప్యానల్ వైస్ చైర్మన్ల పేర్లను మాత్రమే చైర్మన్ చదివారు. రాజకీయ నేతలపై విజయసాయి అసభ్యకర ట్వీట్లు చేస్తున్నారంటూ ఇటీవల రాజ్యసభ చైర్మన్‌కు ఎంపీ రఘురామ ఫిర్యాదు చేశారు. విజయసాయిని ప్యానల్ వైస్‌చైర్మన్ నుంచి తొలగించాలని ఎంపీ రఘురామకృష్ణరాజు డిమాండ్ చేశారు.

## నాడు వద్దన్న మెట్రో నేడు ముద్దయ్యిందా: కిషన్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** నాడు రక్తం ఏరులై పారినా మెట్రో నిర్మాణం వద్దన్న వ్యక్తికి.. నేడు ఎయిర్ పోర్టు మెట్రోకు శంకుస్థాపన చేసే అర్హత ఉందా? అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన మెట్రో ఫేజ్-ఎలో భాగమైన ఓల్డ్ సిటీ మెట్రో పనులను ఎప్పుడు ప్రారంభిస్తారన్నారు. ప్రాజెక్టుకు ఇవ్వవలసిన నిధులను ఎప్పుడు చెల్లిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. 8 సంవత్సరాలలో రూ. 800 కోట్ల ప్రాజెక్టును పూర్తి చేయటానికి సహకరించని కేసీఆర్, రూ. 6,250 కోట్ల ప్రాజెక్టును 3 సంవత్సరాలలో పూర్తి చేస్తానంటే ప్రజలు నమ్మాలా అని కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ బూటకపు వాగ్దానాలన్నీ ముందస్తు ఎన్నికల ప్రణాళికలో భాగమే అని.. అందుకే కేసీఆర్ ఫాం హౌస్‌ను వదిలి జిల్లాల పర్యటన చేస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

## ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి) సంతోషంగా జరుపుకోవాలనే ఆలోచనతో పేదలకు ప్రభుత్వం గిఫ్ట్ ప్యాక్‌లు (దుస్తులు) పంపిణీ చేస్తుందన్నారు. ఎల్‌బీ స్టేడియంలో జరిగే విందుకు సీఎం హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా ఒక్కో నియోజకవర్గ పరిధిలో ఎనిమిది ప్రాంతాలలో క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల సహకారంతో చర్చి కమిటీ ప్రతినిధులతో సమావేశాలను నిర్వహించి డిన్నర్, గిఫ్ట్ ప్యాక్ ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఇందుకోసం ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో ప్రాంతానికి 500 చొప్పున గిఫ్ట్ ప్యాక్ లు, డిన్నర్ నిర్వహణ కోసం ఒక లక్ష రూపాయలు చొప్పున అందించనున్నట్లు వివరించారు. దీని కోసం నియోజకవర్గానికి ఒక ఒక ప్రత్యేక అధికారిని నియమించామని చెప్పారు. ఈ సమావేశంలో మండలి ప్రభుత్వ విప్ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీలు స్టీఫెన్ సన్, సురభి వాణి దేవి, హసన్ జాఫ్రీ, ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, దానం నాగేందర్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, కౌసర్ మొహినోద్దిన్, టీఎస్‌ఈడబ్ల్యూఐసీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఎండీ కాంతి వెస్లీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో 27 ఏళ్ల రికార్డు బద్దలు

(మొదటి పేజీ తరువాయి) అయితే ఆశ్చర్యకరంగా ఆప్ ఇక్కడ ఖాతా తెరవడం ఖాయమైంది. ఆప్ పోటీ చేయడం కాంగ్రెస్ భారీ నష్టం చేసిందనే విశ్లేషణలు మొదలయ్యాయి. తాజా ట్రెండ్స్ ప్రకారం.. 154 స్థానాల్లో బీజేపీ ఆధిక్యం కొనసాగుతోంది. దీంతో అధికార పార్టీకి రికార్డ్ స్థాయి విజయం ఖాయంగా కనిపిస్తోంది. గతంలో 2002 ఎన్నికల్లో బీజేపీ అత్యధికంగా 127 స్థానాలను గెలుచుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో ఆ రికార్డు చెరిగిపోవడం పక్కాగా కనిపిస్తోంది.

# తిరుమలలో వైభవంగా కృత్తికా దీపోత్సవం

యోగనారిసంహుడి వద్ద నేతి దీపాల వెలిగింపు

**తిరుమల, డిసెంబర్8 (సమ సమాజం):** శ్రీవారి ఆలయంలో కృత్తిక పౌర్ణమి దీపోత్సవం ఘనంగా జరిగింది. పున్నమిని పురస్కరించుకుని సాయంత్రం శ్రీవారికి సాయంకాల కైంకర్యాదులు నివేదనలు పూర్తయిన తరువాత ఈ దీపోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దీపాలను వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అత్యంత ఘనంగా జరిగిన ఈ పర్వ దీపోత్సవంలో తొలుత శ్రీ యోగ నరసింహస్వామి ఆలయం ప్రక్కనవున్న పరిమళం అర దగ్గర 100 కొత్త మూకుళ్ళలో నేతి వత్తులతో దీపాలను వెలిగించారు. తదుపరి వీటిని ఛత్రచామర, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఆనందనిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. అనంతరం గర్భాలయంలో అఖండం, కులశేఖరపడి, రాములవారిమేడ, ద్వారపాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళమాత, బంగారుబావి, కల్యాణమండపం, సభఅర, తాళ్లపాకంఅర, భాష్యకారుల సన్నిధి, యోగనరసింహస్వామి, విష్వక్సేనులు, చందనంఅర, పరిమళంఅర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయ మండపం, పూలబావి, రంగనాయక మండపం, మహాద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామి ఆలయం, స్వామి పుష్కరిణి సుమారుగా 100 నేతి జ్యోతులను మంగళ వాయిద్యల నడుమ వేదమంత్రోచ్ఛారణలతో ఏర్పాటు చేశారు. తిరుపతి శ్రీ కపిలేశ్వరాలయంలో కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకుని కృత్తికా దీపోత్సవం జరిగింది. సాయంత్రం 6 గంటలకు గర్భాలయంలో ఆ తరువాత శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయ గోపురం, శ్రీ కామాక్షి అమ్మ ఆలయ గోపురం, ధ్వజస్తంభంపైన దీపారాధన చేశారు. ఈ సందర్భంగా ఊంజల్ మండపంలో ఆకట్టుకునేలా శివలింగం, శూలం ఆకృతిలో ప్రమిదలు వెలిగించారు. అనంతరం జ్వోలాతోరణం వెలిగించారు.

## ఇంటర్ పరీక్ష ఫీజుకు మరోమారు అవకాశం

(మొదటి పేజీ తరువాయి) ఫీజులను చెల్లించాలని సూచించింది. స్టూడెంట్ల నుంచి ఫీజులను స్వీకరించే కాలేజీలు.. డిసెంబర్ 13లోగా ఇంటర్ బోర్డుకు ఫీజుల మొత్తాన్ని బదిలి చేయాలని ఆదేశించింది. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నవంబర్ 14 నుంచి 30లోపు ఫీజులు చెల్లించాలని గతంలో ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. రూ.100 ఆలస్య రుసుముతో డిసెంబర్ 2 నుంచి 6 వరకు.. రూ.500 రుసుముతో 8 నుంచి 12 వరకు, వెయ్యి రుసుముతో 14 నుంచి 17 వరకు, రూ.2000 ఆలస్య రుసుముతో డిసెంబర్ 19 నుంచి 22 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొంది. అయితే విద్యార్థుల వినతి మేరకు తాజాగా కేవలం రూ. 100 ఆలస్య రుసుముతో డిసెంబర్ 12 వరకు ఫీజులు చెల్లించేందుకు ఇంటర్ బోర్డు అనుమతిచ్చింది. ఫస్టియర్, సెకండియర్ జనరల్ కోర్సుల విద్యార్థులు రూ.500, సైన్స్, వొకేషనల్ విద్యార్థులు రూ.710 ఫీజుగా చెల్లించాలని అధికారులు సూచించారు. మరోవైపు ఇంటర్ పరీక్షల్లో ఈ ఏడాది 100 శాతం సిలబస్ అమలవుతుందని.. పాతపద్ధతిలోనే పరీక్షలను నిర్వహిస్తామని అధికారులు ఇప్పటికే వెల్లడించారు. కళాశాలల్లో అడ్మిషన్ పొందకుండా.. హాజరుశాతం లేకుండా హాజరు మినహాయింపు పథకం కింద విద్యార్థులు రూ.500 ఫీజు కట్టి పరీక్షలు రాయొచ్చని సూచించారు.

# తెలంగాణలోనూ గుజరాత్ ఫలితమే



(మొదటి పేజీ తరువాయి) **జగిత్యాల, డిసెంబర్ 8 (సమ సమాజం):** తెలంగాణలో కూడా గుజరాత్ ఫలితమే పునరావృతమవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు. అవినీతి ప్రభుత్వం ఓడిపోక తప్పదని చెప్పారు. అభివృద్ధి చేసే వాళ్లే గెలుస్తారన్న బండి సంజయ్.. అవినీతిపరులు పడిపోతారని తెలిపారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట్ విడిది నుండి బండి సంజయ్ 'ప్రజా సంగ్రామ యాత్ర' మొదలైంది. సిర్పూర్, నడికుడ, రాఘవపేట, హుస్సేన్ నగర్, ముత్యంపేట్ మీదుగా వేంపేట్ వరకు ఈ పాదయాత్ర కొనసాగనుండగా.. వెంపెట్ సమీపంలో బండి సంజయ్ రాత్రి బస చేయనున్నారు. మొత్తం12.6 కిలోమీటర్ల మేర బండి సంజయ్ పాదయాత్ర కొనసాగనుంది. పదేపదే మోటర్లకు మీటర్లు అంటూ టిఆర్ఎస్ చేస్తున్న విమర్శలను కొట్టిపారేశారు. మోటార్లకు మీటర్లు పెడితే తానే బాధ్యత వహిస్తానని బండి సంజయ్ అన్నారు. లేని పక్షంలో సీఎం కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే అని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబ అవినీతికే మీటర్లు పెట్టామని చెప్పారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. నిరూపించకపోతే రాజకీయ సన్యాసం తీసుకునేందుకు కేసీఆర్ సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. రూ.60 వేల కోట్ల బకాయిలతో డిస్కంలను సంక్షోభంలోకి నెట్టిన సీఎం... కరెంట్ ఛార్జీల పెంపుతో జనం నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. మైసూర్ పాక్, మైసూర్ బజ్జీ, ఇరానీ చాయ్... అక్కడి నుండే వస్తున్నాయా? అని ప్రశ్నించారు. మేకిన్ ఇండియా పేరుతో స్థానిక పరిశ్రమల నుండే చైనా బజార్లకు వస్తువులు వెళుతున్నాయని చెప్పారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోతే ఉరేసుకుంటానన్న ఎమ్మెల్యే ఎటుపోయిండని బండి సంజయ్ ప్రశ్నించారు. రూ.250 కోట్లతో షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు డబ్బులివ్వరా అని అడిగారు. లక్ష కోట్లతో దొంగ సారా దందా చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాన్ని ఒప్పించి రూ.250 కోట్లతో షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తానన్న హామీ ఏమైందని అడిగారు. గల్ఫ్ బాధితుల శవాలను కూడా తీసుకురాలేని అసమర్థులు అంటూ విమర్శలు చేశారు. వేములవాడ రాజన్న, బాసర సరస్వతి ఆలయాలకు వందల కోట్ల మంజూరు హామీ ఏమైందని టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బండి సంజయ్ ప్రశ్నించారు. మళ్లీ కొండగట్టు అంజన్న పేరుతో దేవుళ్లకే శఠగొపం పెడతున్నారని ఆరోపించారు. బీడీ కార్మికుల బాధలెందుకు పట్టించుకోవడం లేదన్నారు. పెన్షన్లకు కటాఫ్ డేట్ ఎత్తేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్న నిధులన్నీ కేంద్రానివే అని బండి సంజయ్ చెప్పారు.

# ఫామ్‌హౌస్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదుపై వాదనలు

(మొదటి పేజీ తరువాయి) న్యాయవాదులు ఈ అంశాన్ని లేవనెత్తారా అని హైకోర్టు ప్రశ్నించగా.. సీబీఐతో మాత్రమే దర్యాప్తు జరిపించాలని వారి వాదన అని ఏజీ కోర్టుకు తెలిపారు. నిందితులపై అవినీతి నిరోధక చట్టం కింద తప్పుల తడక కేసు నమోదు చేశారని ప్రతిపాదిత న్యాయవాది రాంచందర్ రావ్ వాదనలు వినిపించారు. మొయినాబాద్ పోలీసుల పరిధిలోకి రాని సెక్షన్‌లను ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని చెప్పారు. అవినీతి నిరోధక చట్టం కింద నేరం చేసినట్టు పోలీసులు భావిస్తే.. జీరో ఎఫ్ఐఆర్ చేసి కేసు బదిలీ చేయాల్సిందన్నారు. లా అండ్ ఆర్డర్ పోలీసులకు.. పీసీ యాక్ట్ లో విచారణ చేయాల్సిన అర్హత లేదని చెప్పారు. రాజేంద్రనగర్ ఏసీపీ పీసీ యాక్ట్ కింద నమోదైన కేసు.. దర్యాప్తు ఎలా చేస్తారని రాంచందర్ రావ్ ప్రశ్నించారు. కరప్షన్ యాక్ట్ సెక్షన్ 8 పెట్టడం పూర్తిగా విరుద్ధమని అన్నారు. 100 కోట్లు డీల్ జరిగింది అన్నప్పుడు స్వాధీనం చేసుకున్న డబ్బు చూపించాలి కదా అని చెప్పారు. భారీ కుట్రకు చెక్ పెట్టామని పోలీసులు అంటున్నారు.. అలా అయితే ఘటనా స్థలంలో 100 కోట్లు ఉంటే పోలీసులు డబ్బులు ఎందుకు బయట పెట్టలేదని రాంచందర్ రావ్ కోర్టులో వాదనలు వినిపించారు.

# సిట్ రివిజన్ పిటిషన్‌పై వాదనలు పూర్తి

నేడు తీర్పు వెలువరించనున్న హైకోర్టు

**హైదరాబాద్, డిసెంబర్8 (సమ సమాజం):** మొయినాబాద్ ఫాంహౌస్ కేసులో సిట్ క్రిమినల్ రివిజన్ పిటిషన్ పై హైకోర్టులో గురువారం విచారణ సాగింది. బీఎల్ సంతోష్, తుషార్, జగ్గుస్వామి, శ్రీనివాస్‌లను ఎఫ్ఐఆర్ జాబితాలో చేరుస్తూ దాఖలైన మెమోను ఏసీబీ కోర్టు రిజక్ట్ చేయడంతో సిట్ హైకోర్టును ఆశ్రయించింది. ఏసీబీ కోర్టు తన పరిధి దాటి వ్యవహరించిందని అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. ఏసీబీ కోర్టు మెమో కొట్టి వేయడంతో హైకోర్టుకు వచ్చామని, మెమోను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఏసీబీ కోర్టు తీర్పుపైనే తాము హైకోర్టుకు వచ్చామని, ఇందులో ప్రతిపాదిత నిందితుల తరపు వాదనలు వినాల్సిన అవసరం లేదని హైకోర్టుకు వివరించారు. సిట్ నమోదు చేసిన కేసులో తమ క్లయింట్స్ భాగస్వాములు కాబట్టి.. తమ వాదనలు కూడా వినాలని ప్రతిపాదిత తరపు నిందితుల న్యాయవాదులు హైకోర్టు సీనియర్ కౌన్సిల్ రాంచంద్రరావు, ఎల్. రవిచందర్ లు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సిట్ తరపు అడ్వకేట్ జనరల్ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పు కాపీలను చదవి వినిపించారు. మెమో రిజక్ట్ తీర్పు కాపీ.. క్వాష్ పిటిషన్ కి రాసే తీర్పు కాపీలా ఉందని కోర్టుకు ఏజీ బీఎస్ ప్రసాద్ తెలిపారు. కేసులో ఎ7గా ఉన్న శ్రీనివాస్ తరపు వాదనలను రాంచంద్రరావు వినిపించారు. సిట్ జారీ చేసిన నోటీసుకు శ్రీనివాస్ ఇప్పటికే రెండు రోజులు సిట్ విచారణకు హాజరు అయ్యారని, అయినా సరే సిట్ పోలీసులు శ్రీనివాస్ ను వేధిస్తున్నారని, అతడిని అక్రమంగా నిందితుల జాబితాలో చేర్చారని హైకోర్టు దృష్టికి రాంచంద్రరావు తీసుకొచ్చారు. ప్రాథమిక దర్యాప్తు పూర్తికాకుండానే ఏసీబీ కోర్టులో ఉద్దేశపూర్వకంగా సిట్ అధికారులు మెమో దాఖలు చేసినట్లు కోర్టుకు తెలిపారు. ఈ కేసులో ఎ1రామచంద్ర భారతి తరపున హైకోర్టు సీనియర్ కౌన్సిల్ ఎల్. రవిచందర్ వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం 8 కింద కేసు పెట్టడం చట్ట విరుద్ధమని, మొయినాబాద్ పోలీసుల పరిధిలోని రాని సెక్షన్లను పేర్కొన్నట్లు కోర్టుకు తెలిపారు. అలాగే.. రూ.100 కోట్లు డీల్ జరిగిందని ఆరోపిస్తున్నప్పుడు ఆ డబ్బును బహిర్గతం చేయాలి కదా..? అని సిట్ తరపు న్యాయవాదులను ప్రశ్నించారు. ఒక ఫొటో, వాట్సాప్ చాటింగ్ లో పేర్లు ఉన్నంత మాత్రాన నిందితుల జాబితాలో పేర్లను ఎలా చేర్చుతారంటూ వాదనలు వినిపించారు. ఇప్పటికే అరెస్ట్ అయిన రామచంద్ర భారతి కోర్టు తీర్పుతో బెయిల్ పై బయటకు వచ్చారని, అయినా ఆయనపై అక్రమ కేసులు బనాయించి.. అరెస్ట్ చేశారని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఫాం హౌస్ లో కేసులో ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిపైనే ఎన్నికల ఉల్లంఘణ కేసులతో పాటు 80కి పైగా కేసులు ఉన్నాయని, ఆ డేటా తమ వద్ద ఉందని కోర్టుకు తెలిపారు. ప్రముఖులతో ఫొటోలు ఉన్నంత మాత్రాన వాళ్లందరికి కేసులతో సంబంధం ఉండదని వాదించారు. తాను ఇటీవలే ఒక ఎమ్మెల్యే తరపున కేసు వాదించానని, ఆ కేసు గెలవడంతో సదరు ఎమ్మెల్యే తనతో ఫొటో దిగారని, ఆ ఫొటోతో తనపై కూడా పీడీ యాక్ట్ నమోదు చేస్తారా..? అని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు కేసును శుక్రవారానికి వాయిదా వేసింది.

## షర్మిల ముమ్మాటికీ బిజెపి వదిలిన బాణమే

(మొదటి పేజీ తరువాయి) చేశారు. ఎక్కడ కూడా సమస్యలపై లేదా విభజన సమస్యలపై మాట్లాడడం లేదన్నారు. కేవలం అధికార టిఆర్ఎస్‌పై నోరు పారేసుకుంటోందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం టీఆర్ఎస్ పార్టీనే లక్ష్యంగా చేసుకుని ఈడీ, ఐటీ దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. మునుగోడు ఎన్నికల తరువాత పోడు, ధరణి, అసంఘటిత సమస్యల పై టీఆర్ఎస్ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందని వెల్లడించారు. ఈ సమస్యలపై టిఆర్ఎస్ మరింత వేగంగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

# నేడు మెట్రో ఫేజ్-2కు సిఎం కెసిఆర్ శంకుస్థాపన: మెట్రో ఎండి

(మొదటి పేజీ తరువాయి) పూర్తిచేశామని మెట్రో ఎండీ తెలిపారు. మెట్రోలో 31 కోట్ల 50 లక్షల మంది ప్రయాణించారని, 3,834 కిలోమీటరు ఇప్పటి వరకు మెట్రో తిరిగిందని పేర్కొన్నారు. 9.2 కోట్ల లీటర్ల పెట్రోల్, డీజిల్ ఆదా అయిందని, రెండు డీపీఆర్?లు కేంద్రానికి పంపామని ఎన్.వి.ఎస్.రెడ్డి వివరించారు.

## గూగుల్‌కు పోటీగా మైక్రోసాఫ్ట్ సెర్చ్ ఇంజిన్

(మొదటి పేజీ తరువాయి)చేయబోతుంది. కంటెంట్ సెర్చ్ చేయడానికి మాత్రమే కాదు.. ఈ యాప్ తో మెసేజింగ్, షాపింగ్, న్యూస్ కంటెంట్ సెర్చ్ కూడా చేయొచ్చు. అయితే.. ఇదివరకే మైక్రోసాఫ్ట్ కు సొంత సెర్చ్ ఇంజిన్ బింజ్ ఉండగా, దాని పాపులారిటీ గూగుల్, సిరికి ఉన్నంత లేదు. అందుకే సూపర్ యాప్ ని తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బింజ్ యాప్ పాపులారిటీ పెంచడానికి, సూపర్ యాప్ ని డెవలప్ చేయడానికి మైక్రోసాఫ్ట్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ

# హిమాచల్‌లో అధికారం దిశగా కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి) ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఖాతా తెరిచింది. సుందర్‌నగర్ సీటులో ఆ పార్టీ నేత రాకేష్ జన్వాల్ విజయం సాధించారు.హోరాహోరీ పోరులో ఉదయం 11:20 గంటల సమయంలో బీజేపీపై కాంగ్రెస్ పైచేయి సాధించినట్టుగా కనిపిస్తోంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 35 కాగా 39 స్థానాల్లో కాంగ్రెస్ ఆధిక్యం కొనసాగుతోంది. కాగా బీజేపీ 27 చోట్ల, ఇతరులు 3 స్థానాల్లో లీడ్‌లో ఉన్నారు. కాగా అవకాశం వస్తే జారవిడుచుకోకూడదని భావిస్తున్న బీజేపీ అసలైన రాజకీయ చదరంగాన్ని మొదలుపెట్టింది. ప్రస్తుతం 1-3 స్థానాల్లో లీడ్‌లో కొనసాగుతున్న స్వతంత్రులు ప్రభుత్వ ఏర్పాటులో కీలకమవ్వొచ్చని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తోంది. అందుకే స్వతంత్రులను తమవైపు తిప్పుకోవడంపై దృష్టిసారించింది. ఇందుకోసం బీజేపీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డేను ప్రత్యేకంగా హిమాచల్‌ప్రదేశ్‌కు పంపించింది. స్వతంత్రులను తమవైపు తిప్పుకోవడంపై ఆయన ఇప్పటికే పావులు కదపడం మొదలుపెట్టారు. మరి ఫలితాలు ముగింపు




# చలన చిత్రం




## బాలయ్యతో అనిల్ రావిపూడి కొత్త సినిమా

'అఖండ' సక్సెస్‌తో నందమూరి బాలకృష్ణ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను సెట్స్ మీదకు తీసుకెళ్తున్నాడు. ప్రస్తుతం ఈయన నటించిన 'వీర సింహా రెడ్డి' రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. గోపిచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఒక్క పాట మినహా షూటింగ్ మొత్తం పూర్తి చేసుకుంది. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి. ఇక ఈ సినిమా తర్వాత బాలయ్య, అనిల్ రావిపూడితో సినిమా చేయనున్నాడు. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమాలను ఘనంగా జరుపుకుంది. ఈ కార్యక్రమానికి కే. రాఘవేంద్ర రావు, దిల్‌రాజు, అల్లు అరవింద్, గెస్ట్‌లుగా వచ్చారు. ఈ సినిమాకు 'బ్రో ఐ డోంట్ కేర్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో బాలయ్య 45ఏళ్ల వయసున్న తండ్రి పాత్రలో నటిస్తున్నాడు. బాలయ్య కూతురుగా పెళ్లి సందడి బ్యూటీ శ్రీలీల నటిస్తుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అర్జున్ రామ్‌పాల్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నాడు. కెరీర్ బిగెనింగ్ నుండి కామెడీ కథలను నమ్ముకుని హిట్టు సాధించిన అనిల్.. మొదటి సారిగా మాస్ యాక్షన్ సినిమా తీస్తున్నాడు. అది కూడా మాస్‌కు కేరాఫ్ అడ్రస్ అయిన బాలయ్యతో. మరి ఈ కాంబో బాక్సాఫీస్‌పై ఎలాంటి సంచలనాలు క్రియేట్ చేస్తుందో చూడాలి.




## రామాయణం ఆధారంగా మరో బాలీవుడ్ సినిమా

రాముడిగా రణబీర్ ..సీతగా సాయిపల్లవి ఎంపిక ?




టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్స్ ఎందరున్నప్పటికీ సాయిపల్లవికి ఉన్న క్రేజ్ వేరు. యూత్‌తో పాటు ఫ్యామిలీస్ ఆమె సినిమాల కోసం ఎదురుచూస్తుంటారు. గ్లామర్ రోల్స్ కాకుండా నటనకు ఇంపార్టెన్స్ ఉన్న క్యారెక్టర్స్ ను ఎంచుకుంటూ తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లోనూ ప్రత్యేక గుర్తింపును అందుకుంది. సౌత్‌లో మెప్పించిన ఆమె ఇప్పుడు బాలీవుడ్‌కు వెళ్లబోతోందట. అదికూడా ఓ పౌరాణిక చిత్రంతో కావడం విశేషం. రణబీర్ కపూర్ హీరోగా రామాయణం ఆధారంగా బాలీవుడ్‌లో ఓ సినిమా రూపొందబోతోంది. ఇందులో రాముడిగా రణబీర్ నటిస్తుండగా.. రావణుడి పాత్రను హృతిక్ రోషన్ పోషించనున్నాడు. మధు మంతెన నిర్మించే ఈ చిత్రం వచ్చే యేడాది సెప్టెంబర్‌లో షూటింగ్ మొదలవనుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఇందులో సీత పాత్రకు సాయిపల్లవిని సంప్రదించినట్టు తెలుస్తోంది. నిజానికి ఈ పాత్రకు గతంలో దీపిక పదుకొణె, కరీనా కపూర్ పేర్లు వినిపించాయి. ఇప్పుడేమో సాయిపల్లవిని ఫైనల్ చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉండే క్యారెక్టర్ కావడంతో ఆమె ఈ పాత్రకు న్యాయం చేస్తుందని నమ్ముతున్నారట మేకర్స్. మరి సెలెక్టివ్‌గా సినిమాలకు సైన్ చేసే సాయిపల్లవి.. ఈ సినిమా విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి!

## సంక్రాంతి బరిలో వాల్తేరు వీరయ్య

13న విడుదల తేదీని ప్రకటించిన మేకర్స్

'బాస్ పార్టీ' అంటూ మాస్ సాంగ్‌తో ఇంప్రెస్ చేస్తోన్న 'వాల్తేరు వీరయ్య'.. సినిమా రిలీజ్ డేట్‌పై కూడా క్లారిటీ ఇచ్చేశాడు. చిరంజీవి హీరోగా బాబి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సంక్రాంతికి రిలీజ్ అంటూ ఇప్పటికే చెప్పారు. కానీ విడుదల ఎప్పుడనేది మాత్రం ప్రకటించలేదు. బుధవారం రిలీజ్ డేట్‌ను కూడా అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. జనవరి 13న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు కన్‌ఫర్మ్ చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో లుంగీ, కలర్‌ఫుల్ షర్ట్, హెడ్ బ్యాండ్‌తో వింటేజ్ మాస్ అవతార్‌లో ఆకట్టుకున్నారు చిరంజీవి. చేతిలో ఆయుధం పట్టుకుని సముద్రం మధ్య వర్షంలో పడవ నడుపుతూ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. చిరంజీవికి జంటగా శ్రుతిహాసన్ నటిస్తోంది. ఊర్వశి రౌటేలా స్పెషల్ సాంగ్ చేసింది. ఈ మాస్ ఎంటర్‌టైనర్‌లో రవితేజ కీలకపాత్ర పోషిస్తున్నాడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. సంక్రాంతి పండుగకు థియేటర్స్‌లో మాస్ పార్టీని అందించడానికి మరొక బ్లాక్ బస్టర్ లోడ్ అవుతోంది అని చెబుతున్నారు మేకర్స్. మరోవైపు బాలకృష్ణ 'వీరసింహారెడ్డి', విజయ్ 'వారసుడు' చిత్రాలు జనవరి 12న రిలీజ్ చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. చిరంజీవి సినిమా కూడా రిలీజ్ డేట్ కన్‌ఫర్మ్ అవడంతో.. ముగ్గురిలో సంక్రాంతి విజేత ఎవరనే ఆసక్తి నెలకొంది.




## ధమాకా నుంచి లిరికల్ సాంగ్ విడుదల

రవితేజ ద్విపాత్రాభినయం చేస్తున్న లేటెస్ట్ సినిమా 'ధమాకా'. త్రినాథ్‌రావు నక్కిన దర్శకత్వం వహించిన

ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటుంది. 'క్రాక్' వంటి మంచి హిట్ తర్వాత 'ఖిలాడీ', 'రామారావు డ్యూటీ'లు బ్యాక్ టు బ్యాక్ ప్లాప్‌లు కావడంతో.. రవితేజ ఆశలన్నీ ఈ చిత్రంపైనే ఉన్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లు, టీజర్ సినిమాపై విపరీతమైన అంచనాలు నెలకొల్పాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందింన ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 23న రిలీజ్ కానుంది. ఈ క్రమంలో చిత్రబృందం వరుస అప్‌డేట్‌లు ప్రకటిస్తూ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని దండకడియాల్ లిరికల్ సాంగ్ రిలీజైంది. లేటెస్ట్‌గా రిలీజైన ఈ మాస్ బీట్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రవితేజ ఎనర్జిటిక్ స్టెప్స్ ఫ్యాన్స్‌లో జోష్ నింపుతున్నాయి. భీమ్స్ సిసిరోలియో స్వర పరిచిన ఈ పాటను భీమ్స్‌తో పాటు సాహితి, మంగ్లీ ఆలపించారు. అంతేకాకుండా ఈ పాటకు భీమ్స్ స్వయంగా సాహిత్యం అందించాడు. ఇప్పటికే చిత్రం నుండి రిలీజైన పాటలన్ని చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ ట్రాక్‌లోకి రావాలని రవితేజ కసితో ఉన్నాడు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. రవితేజ కెరీర్‌లోనే హైయెస్ట్ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందింది. రవితేజకు జోడీగా పెళ్ళి సందడి ఫేం శ్రీలీల నటిస్తుంది. ఈ చిత్రానికి ప్రసన్న కుమార్ బెజవాడ కథ-స్క్రీన్‌ప్లే-మాటలు అందిస్తున్నాడు.




## సస్పెన్స్ థ్రిల్లర్ 'కూమన్'

సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలు ఎన్ని వచ్చినా.. మళ్లీ ఏదో ఒక కొత్త కాన్సెప్ట్ తో చిత్రాలు తెరకెక్కిస్తుంటారు డైరెక్టర్లు. వాటిని ప్రేక్షకులు ఆరాధిస్తూనే ఉంటారు. అయితే, దృశ్యం సినిమాలతో హిట్ కొట్టిన డైరెక్టర్ జీతూ జోసెఫ్, అదే జానర్ లో మరొక మలయాలం సస్పెన్స్ థ్రిల్లర్ 'కూమన్' తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. నవంబర్ 4న వచ్చిన ఈ సినిమా, థియేటర్లే కాకుండా ఓటీటీలోనూ (అమెజాన్ ప్రైమ్) హిట్ టాక్ తో నడుస్తుంది. దృశ్యం-1,2 సినిమాలు తీశాక జీతూ జోసెఫ్ స్టామినా ఎంటో అందరికీ అర్థమై ఉంటుంది. స్క్రీన్ ప్లే, డైరెక్షన్ తో పాటు కథలో ట్విస్ట్ లను చూపించే విధానం బాగుంటుంది. ఏ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలో అయినా కథని ఎంతో కొంత ముందే ఊహించొచ్చు. విలన్ ఎవరో కనిపెట్టేయొచ్చు. కానీ, జీతూ జోసెఫ్ సినిమాల్లో ఊహించని మలుపులతో కథని ముందుకు తీసుకెళ్లాడు. స్టోరీ, విలన్ గురించి ముందు తెలిసినట్టే అనిపించినా.. చివరికి ట్విస్ట్ లతో కథ మారిపోవడం అతని సినిమాలో జరుగుతుంటుంది. అలాంటి ట్విస్ట్ లు, షాక్ లు ఇచ్చే సినిమానే ఈ కూమన్. తమిళనాడు -కేరళ బార్డర్లో కానిస్టేబుల్ గా పనిచేస్తుంటాడు గిరి (ఆసిఫ్ అలీ). కష్టపడి పనిచేస్తూ, చిన్న చిన్న కేసుల్ని సులువుగా సాల్వ్ చేస్తుంటాడు. తనని ఎవరైనా చిన్న మాటన్నా, తనకు వ్యతిరేకంగా ఏం చేసినా వాళ్లపై ప్రతీకారం తీర్చుకునే మెంటాల్టీ కలిగి ఉంటాడు. ఒక రోజు వాళ్ల స్టేషన్ కి కొత్తగా వచ్చిన సీఐ, ఒకసారి గిరిని బురదలోకి తోసేస్తాడు. దాంతో అతనిపై ఎలాగైనా రివేంజ్ తీసుకోవాలని పగతో రగిలిపోతుంటాడు గిరి. అలా పగలు పోలీస్ గా, రాత్రుళ్లు దొంగగా ఉంటూ ఊళ్లో దొంగతనాలు చేస్తుంటాడు. పోలీస్ ఎంత ప్రయత్నించినా దొంగ ఎవరన్నది కనిపెట్టలేకపోతుంటారు. దాంతో సీఐకి అధికారులనుంచి ఒత్తిడి పెరుగుతుంది. దొంగతనాలవల్ల వచ్చిన డబ్బుకి బాగా అలవాటుపడిపోయినా గిరి, వరుసగా దొంగతనాలు చేస్తుంటాడు. ఒక రోజు ఊళ్లోని ఒక పెద్దింట్లో దొంగతనానికి వెళ్తాడు. ఆ రోజు ఆ ఇంటి యజమానికి దొరికినట్టే దొరికి తప్పించుకుంటాడు.

సీన్ కట్ చేస్తే.. తర్వాతి రోజు ఆ యజమాని చనిపోయి చెట్టుకు వేలాడుతూ కనిపిస్తాడు. దీంతో గిరికి ఏం అర్థం కాదు. అప్పటినుంచి ఆ ఊళ్లో అలాంటి దొంగతనాలు, మరణాలే జరుగుతుంటాయి. ఈ విషయాలపై ఇన్వెస్టిగేషన్ ప్రారంభించిన పోలీసులకు దొంగ ఎవరో తెలిసిందా? కిల్లర్ ని పట్టుకుంటారా? ఇదంతా ఎవరు ఎందుకు చేస్తున్నారు? చివరికి ఏం జరుగుతుంది? అనేది కథ. గిరి ఒక దొంగ దగ్గర దొంగతనం టెక్నిక్స్ తెలుసుకొని, వాటినే అమలు పరుస్తుంటాడు. సినిమా ఇంటర్వెల్ టైంలో ఆల్మోస్ట్ దొంగను పట్టుకుంటారు అనిపిస్తుంది. కానీ, ఇంటర్వెల్ తర్వాత మర్డర్ మిస్టరీతో కథ వేరే మలుపు తిరుగుతుంది. అయితే, కిల్లర్ ఎవరనేది చివరివరకు సీక్రెట్ గా ఉండేలా, ఎవరూ ఎక్స్ పెక్ట్ చేయని విధంగా ప్లాన్ చేసి సినిమా తీశాడు జోసెఫ్. మలయాలం యాక్టర్ ఆసిఫ్ ఈ సినిమాలో హీరోగా చేశాడు. స్టోరీ మొత్తాన్ని తన చుట్టూ తిప్పించుకున్న ఆసిఫ్ అతని పాత్రకి పూర్తి న్యాయం చేశాడు. బ్యాగ్రౌండ్ మ్యూజిక్, సినిమాటోగ్రఫీ, క్లోజప్ షార్ట్స్, చూస్తుంటే సీట్లలో కూర్చున్న అభిమానులకి టెన్షన్ వస్తుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in